క్లుప్తంగా

కనుల పండువగా కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: మండల సరిహద్దులోని తాడిగోళ్ళలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. పీటీఎం శివాలయం సేవకులు ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని చూపరులను ఆకట్టుకునేలా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ రామ మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా.. సర్కిల్ పరిధిలోని పీటీయం మండలం మారగానిపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ద్విచక్రవాహనంలో ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. ములకలచెరువు మండలం కాలువపల్లెకు చెందిన రాజు(35), మేకల రెడ్డెప్ప(45)లను అరెస్టు చేసి వారి నుంచి 768 కర్ణాటక టెట్రాప్యాకెట్లు , ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని నింధితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు కలికిరిలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం

కలికిరి: మండల కేంద్రం కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి బండకాడపల్లి, నగ్రావాండ్లపల్లి, రామ్ నగర్ కాలని, సాయంత్రం శీనయ్య కాలని, బత్రెడ్డిగారిపల్లి, నడింపల్లి, మంగమ్మ కాలని ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటి స్తారని, కావున మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు పెన్షనర్ల సమావేశం

మదనపల్లె సిటీ: స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం పెన్షనర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘ కార్యదర్శి బి.వెంకటరమణ తెలిపారు. సమావేశానికి ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్ కార్యదర్శి, రాష్ట్ర ఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి పెన్షనర్లు హాజరు కావాలని కోరారు.

హంసవాహనంపై ఊరేగింపు

మదనపల్లె సిటీ: శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక సొసైటీ కాలనీలోని శ్రీరామాలయంలో శనివారం ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీమసేవా ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు పూడ్చారని ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం: ప్రజల సౌకర్యార్థం మురుగు నీటి కాలువ పనుల కోసం తీసిన కాలువను ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పూడ్చేశారని సర్పంచ్ సుబ్బిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం సర్పంచ్ మాట్లాడుతూ జీజీఎంపీ గ్రాంట్ ద్వారా బూర్లపల్లి గ్రామ సచివాలయానికి గతంలో రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా బూర్లపల్లిలో రూ.17 లక్షల పనులు పూర్తి కాగా మిగిలిన రూ.3 లక్షల నిధులతో ఇదే పంచాయతీలోని సొన్నువారిపల్లిలో మురుగు నీటి కాలువ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. ఇదే గ్రామానికి చెందిన పెన్నయ్య ఉపాధ్యాయుడు సదరు స్థలం తనదంటూ దౌర్జన్యంగా పూడ్చేశాడని సర్పంచ్ తెలిపారు. గతంలో కూడా స్మశాన వాటిక దారి సౌకర్యం పనులను కూడా అతడు అడ్డుకుని నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నానని సర్పంచ్ తెలిపారు.

సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కడుదాం

కలకడ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టాలని వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి కోరారు. శనివారం మండలంలోని దేవులపల్లె పంచాయతీ యంగన్నగారిపల్లె, గొబిళ్ళవారిల్లె, వడ్డిపల్లె, బొజ్జగుంటపల్లె, దేవులపల్లె, హరిజనవాడ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లును అభ్యర్థించారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వం కొనసాగించడానికి అందరికి నిత్యం అందుబాటులో ఉండే పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పివిమిథున్‌రెడ్డికి రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్ హరినాథరెడ్డి, గోవర్ధన్, సుందరబాబు, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, అంజన్‌కుమార్, రవికుమార్, బాబురెడ్డి, మధసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం..ఆశీర్వదించండి

- ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- చెన్నకేవస్వామి ఆలయంలో పూజలు
- ఎమ్మెల్యే అభ్యర్థి ద్వాకనాథ్‌రెడ్డి



బూచిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: గత 40 ఏళ్ళలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాను. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని గెలిపించాలని పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన మండలంలోని బూచిపల్లిలోని చెన్నకేవస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ద్వారకనాథ్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. మహిళలు ఎంతో ఉత్సాహంతో హారతులు పట్టారు. జగనన్న పాలనలో మా కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరిందని, ఎన్నికల్లో తామంతా వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని భరోసా ఇచ్చారు. ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మళ్ళీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. ఉమ్మడి కూటమి నాయకులు ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇస్తారని, వాటిని నమ్మి మోసపోరాదని ప్రజలకు హితబోధ చేశారు. ఆయన వెంట ప్రజా ప్రతినిథులు, నాయకులు మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, రియాసత్ అలీఖాన్, సుబ్బరాం, అనిత, కేవీ రమణ, రామిరెడ్డి, శ్రీరాములురెడ్డి, కొట్టి మల్లి, కుంచే శీనూ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

బూచిపల్లిలో టీడీపీలో ఉన్న నీరుగట్టి గంగాధర్, చాకల కేశవ్, గుట్టకింద మంజు కుటుంబాలకు చెందిన 10 మంది వైఎస్సార్‌సీపీలోకి చేరారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము పార్టీలోకి వచ్చామన్నారు.

నేడు మదుమూరులో ప్రచారం

మండలంలోని బూర్లపల్లి పంచాయతీ కొత్తపల్లి నుంచి మదుమూరు, దేవప్పకోట పంచాయతీల్లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

భర్త గెలుపు కోసం పెద్దిరెడ్డి కవితమ్మ ప్రచారం

కురబలకోట: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గెలుపు కోసం అతని సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ కురబలకోట మండలంలో మండుటెండలో విస్తతంగా ప్రచారం చేశారు. తెట్టు గ్రామ సర్పంచ్ నులక మనోహర్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కోళ్ల వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో తొలిరోజు ఆమె శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పులుసుగుంతల, గట్ల మీద పల్లెలు, తెట్టు, గాలేటివారిపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. తన భర్త పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఊరూరికి రోడ్డు సౌకర్యం కల్పించాడని, కొండలు గుట్టల్లో సైతం తారు రోడ్లు వేయించారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఆదరించాలని కోరారు. మండల కేడర్, నాయకులు, కార్యకర్తలు ఆమె వెంట పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి

పెద్దమండ్యం: సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తనయుడు పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని పాపేపల్లె పంచాయతీలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని కుషావతీ నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పరిధిలోని దాసరిపేట, పాపేపల్లె, మాలపల్లె, గాజులపల్లె, కుమ్మరపల్లె, యల్లంవారిపల్లె, చల్లావారిపల్లె, పాపేపల్లె కాలని, గుడిశవారిపల్లె, పి తురకపల్లె, గురివిరెడ్డిగారిపల్లెల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాజంపేట ఎంపి అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శిద్దవరం విశ్వనాథరెడ్డి, ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, ఎండిసి అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ సభ్యురాలు బోడిమాని గీత, గల్లా నరసింహులు, మాజీ ఎంపీపీ పి.ప్రసాద్‌రెడ్డి, మొఘల్ చాంద్‌బాషా, చాను, కన్నపు రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





తెట్టు గ్రామ ప్రచార కార్యక్రమంలో పెద్దిరెడ్డి కవితమ్మ, దాసరిపేటలో ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డి

మదనపల్లెకు చేరిన ఈవీఎంలు

- జెడ్పీహైస్కూల్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన అధికారులు
- కేంద్రబలగాలతో భారీ భద్రత



స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంల వద్ద ఆర్వో హరిప్రసాద్, రాజకీయపార్టీల నాయకులు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు వినియోగించే ఈవీఎం, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు శనివారం మదనపల్లెకు చేరుకున్నాయి. నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్, ఏఈఆర్వోలు తహసీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు... వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పోలీసుల సమక్షంలో.. ఈవీఎంలను జెడ్పీహైస్కూల్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. అందరి సమక్షంలో గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ... 164–మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 315 బ్యాలెట్ యూనిట్స్, 315 కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్లు 345...ర్యాండమైజేషన్ పూర్తిచేసుకుని మదనపల్లెకు చేరుకున్నాయన్నారు. 24– రాజంపేట పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి 341 బ్యాలెట్ యూనిట్స్, 341 కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్లు 345 చేరాయన్నారు. ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ ప్రారంభించిందని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం తుదిపోరులో ఉండనున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరుగుతుందన్నారు. అనంతరం పోలింగ్ యంత్రాలను రెండోవిడత ర్యాండమైజేషన్ చేపట్టి, దీని ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎంలపై అభ్యర్థి గుర్తు, ఫోటోలను అతికించి పోలింగ్‌కు ముందురోజు పోలింగ్ అధికారుల ద్వారా పోలింగ్ కేంద్రానికి తరలిస్తామన్నారు. జెడ్పీహైస్కూల్‌లోని స్ట్రాంగ్‌రూమ్ వద్ద 24 గంటలు కేంద్రబలగాలతో భారీ భద్రత ఉంటుందన్నారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఈవీఎంల భద్రతకు సంబంధించి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జింకావెంకటాచలపతి, టీడీపీ ఇంతియాజ్, కాంగ్రెస్ రెడ్డిశేఖర్, బీజేపీ భగవాన్, సీఐలు యువరాజ్, ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు

పీలేరు : సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం)లు స్ట్రాంగ్ రూములకు చేర్చినట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను స్థానిక డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూములకు చేర్చారు. అసెంబ్లీ ఎన్నికలకు 337, పార్లమెంట్ ఎన్నికలకు 337 మొత్తం 674 ఈవీఎంలు వచ్చినట్లు తెలిపారు.

నల్లారి సోదరులకు హ్యాట్రిక్ ఓటమి తప్పదు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : నల్లారి సోదరులకు హ్యాట్రిక్ ఓటమి తప్పదని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం యర్రగుంట్లపల్లె, అగ్రహారం పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల నుంచి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పక్కరాష్ట్రంలో విలాసం వంతమైన జీవితం గడుపుతూ నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు వచ్చిన సమయంలో మాత్రమే వారికి ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. తమ కుటుంబమైనా, నల్లారి కుటుంబమైన సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చినవేనని తెలిపారు. అయితే నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అదృష్టవశాత్తు మూడేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉండగానే వేల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. పరిశ్రమలుగానీ, ఎలాంటి సంస్థలు గానీ, వ్యాపారం గానీ లేకుండా వేల కోట్లు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోనే సంపన్నుల కుటుంబాల జాబితాలో నల్లారి కుటుంబం ఉందంటే ఎంత అక్రమాలకు పాల్పడ్డారో ప్రజలకు అర్థం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల కోసం కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చి రాగానే పెద్దిరెడ్డి కుటుంబంపై లేని పోని ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎల్లప్పుడూ ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. వారిని విమర్శించే అర్హత నల్లారి సోదరులకు లేదని చెప్పారు. కరోనా సమయంలో తన తోపాటు ఎంపీ మిథున్‌రెడ్డి, గ్రామ వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించామని తెలిపారు. ఏ రోజైనా నల్లారి సోదరులు ఏనాడైనా కన్పించారా అని ప్రశ్నించారు. గ్రామ వలంటీర్లపై రోజుకో మాట మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రారెడ్డి, జీనత్ షఫీ, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, బాలం నరేంద్రరెడ్డి, హబీబ్‌బాషా, హుమయూన్, బుల్లెట్ శేఖర్, నారే వెంకటరమణారెడ్డి, కడప గిరిధర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, నరసింహారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఎన్నికల ప్రచారం

కేవీపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శనివారం నూతనకాల్వ పంచాయతీలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడిచిన ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందిందని తెలిపారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే మళ్ళీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సాహిత్‌రెడ్డి, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, దేవేంద్రరెడ్డి, సిద్ధయ్య, ఆంజినేయులు, కాటంరెడ్డి, నాగేశ్వర, ప్రభాకర్‌రెడ్డి, అస్లాం, చంద్ర, ఇంతియాజ్, మధు, శ్రీనివాసులురెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

వాల్మీకిపురం: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం అందించాలని చింతల సాయిక్రిష్టారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చారావాండ్లపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి, వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని, ఎంపిగా మిథున్ రెడ్డిని, సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామాల్లో ప్రజాపాలన అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనన్నారు.రాష్ట్రస్థాయి సచివాలయంతో సమానంగా గ్రామస్థాయి సచివాలయం ఏర్పాటుతో ఇంటింటికి ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రమణ, కిరణ్‌కుమార్, ఓరుగంటి రమేష్, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకట్రమణ రెడ్డి, మోహన్‌రెడ్డి, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, మెంబరు శీన, ప్రియరంజన్ రెడ్డి, కిషోర్, రెడ్డి సుబ్రమణ్యం, చెంగల్ రెడ్డి, శ్రీనాథ్, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్
- బొమ్మనచెరువు, కోటవారిపల్లె, మాలేపాడు, పెంచుపాడు పంచాయతీల్లో ఇంటింటి ప్రచారం



బొమ్మనచెరువు పంచాయతీలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారు. టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన మదనపల్లె నియోజకవర్గాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆదర్శంగా అభివృద్ధి చేశాం. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం మండలపరిధిలోని బొమ్మనచెరువు, కోటవారిపల్లె, మాలేపాడు, పెంచుపాడు పంచాయతీల్లో సర్పంచ్‌లు దండుకరుణాకర్‌రెడ్డి, నారాయణస్వామి, గణేష్, సాలమ్మ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వెలుగుచంద్రతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మాట ఇస్తే వెనుకడుగు వేయకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలుపుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మదనపల్లె నియోజకవర్గంలో ప్రజలందరి ఆశీస్సులతో గెలుస్తూ వస్తోందని, ఈ ఎన్నికల్లోనూ ఆశీర్వదించి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగనన్నతోనే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా పోటీచేస్తున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దండుశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, మయూరిరఘునాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, బావాజాన్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి
- పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకుల విస్తృత ప్రచారం
- భర్త నిసార్‌అహ్మద్‌ను ఆశీర్వదించాలని భార్య షేక్ తస్నీమ్ ప్రచారం



పట్టణంలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.... జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. శనివారం ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ భార్య షేక్ తస్నీమ్ కలిసి పట్టణంలోని 21, 23 వార్డుల్లో దక్నీపేట, అమ్మినేనివీధి, జడ్జిబంగళా, మేదరవీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమం చేరిందన్నారు. ప్రజాసంక్షేమానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఖర్చుచేసిన ప్రభుత్వం రాష్ట్రచరిత్రలో మరొక్కటి లేదన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన పాలనపై రాష్ట్రప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజల మనస్సుల్లో జగన్ తన స్థానాన్ని పదిలం చేసుకున్నారన్నారు. తన పాలనలో మంచి జరిగి ఉంటేనే తనను ఆశీర్వదించండంటూ.. ప్రజల ముందుకొచ్చిన ఏకైక నాయకుడు జగన్ మాత్రమేనన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు అధికారం కోసం ఆరాటం తప్ప ప్రజలకు సేవ చేయాలన్న తపన లేదన్నారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు, మాయమాటలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు ఏవేవో పడరాని పాట్లు పడుతున్నాడన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ మూడుపార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ ప్రభంజనం ముందు నిలబడలేవన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదనపల్లె నియోజకవర్గానికి చేసిన మంచిని ప్రజలు ఎప్పుడూ మరవరన్నారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిమ్మనపల్లె షర్మిలాభాను, వై.గిరిజ, బి.ఎ.ఖాజా, ఆర్.వి.శివారెడ్డి, పాల్‌చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, రేణుక, ఫర్జానా, సుగుణ, ముబీనా, వైఎస్సార్ సీపీ నాయకులు వరపన కిరణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరుషఫీ, సలీం, పసుపురవి, వినుతాభాయి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



ప్రచారం చేస్తున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్

వాల్మీకిపురం: రాష్ట్రంలోని మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక నాయక్‌వీధిలో ఇంటింటి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధితో జనం జగనన్న వెంటే నిలుస్తున్నారని ప్రతిపక్షాలకు అర్థమైందని, ఎన్నికల తరువాత వెళ్లిపోయేందుకు మూటా ముల్లె సర్దుకోవాలన్నారు. తాను ఇంటింటికి వెళ్లి పరిచయం చేసుకొంటున్న సమయంలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ లబ్ధిపొందినట్లు తెలుపుతుండటం, సంతోషంగా ఉందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. నవరత్నాల్లోని పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆఘా మొహియుద్దీన్, అబ్దుల్ కలీం, ఇబ్రహీం, మహబూబ్‌బాషా, షాహెద్, సాధిక్, రహంతుల్లా, సైపుల్లా, చికెన్‌మస్తాన్, అలీ, ఇర్ఫాన్, ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్ జగన్



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

వాల్మీకిపురం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పసముద్రం శ్రీనివాసులు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రేపెల్లె, వేమూరు నియోజకవర్గం కొల్లూరులో జరిగిన ప్రజాగళం సభలో జగన్ దళిత ద్రోహి అని విమర్శించడంపై మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆ పార్టీ అనుచరులకు, కార్యకర్తలకు మాత్రమే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, ఇన్నోవా కార్లు, వ్యవసాయ పనిముట్లు అందజేశారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి సీఎం అయినప్పటి నుంచి పార్టీలు చూడకుండా సంక్షేమం పథకాలు అందిస్తుంటే ఓర్వలేక బురద జల్లుతున్నారన్నారు. . కార్యక్రమంలో జగదీష్, హేమంత్, దిలీప్ కుమార్, శివ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరగాలి

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉత్తమ వైద్యసేవలు అందుతాయనే నమ్మకం ప్రతి ఒక్కరిలో పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆదేశించారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందులు, ఆసుపత్రికి హాజరవుతున్న వ్యాధిగ్రస్తుల జాబితాను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన తల్లి ఖాతాలో రూ.5వేలు జమ చేయడానికి ఆసరా పథకం అనుసంధానం చేసి చెల్లించాలని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల జబ్బులకు మందులు అందుబాటులో ఉండాలన్నారు. డాక్టర్ జవహర్‌బాబు, కిషోర్‌కుమార్‌రెడ్డి, హెంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

– ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎస్‌ఈబీ, డీటీఎఫ్ సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఈబీ మంగళగిరి అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఈబీ కార్యాలయంలో మదనపల్లె, వాయల్పాడు, పీలేరు ఎస్‌ఈబీ, డీటీఎఫ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) కింద నమోదైన కేసులకు సంబంధించి సమీక్షించారు. కర్నాటక, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాష్ట్రంలోకి దిగుమతి కాకుండా సరిహద్దు చెక్‌పోస్టల వద్ద నిఘా పెంచాలన్నారు. రాష్ట్రంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ రాజకీయపార్టీలు తరలించే వస్తు సామగ్రి, మద్యం, డబ్బు తదితరాలపై నిఘా ఉంచి, గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు తెలపాల్సిందిగా కోరారు.

ఎస్‌ఈబీ స్టేషన్ తనిఖీ

ములకలచెరువు: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఎం. సుధాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాటుసారా తయారి స్థావరాలపై దాడులు తీవ్రం చేయాలని, కర్ణాటక మద్యం రవాణాను అరికట్టాలని, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు.